# 4

# హత్యలలో చేరి ఉన్న నలుగురు రాజులు

## ఇశ్రాయేలు రాజులైన నాదాబు, బయెషా, ఏలా, జిమ్రీ

## (1 రాజులు 15:25-16:20)

చాలా మంది పుస్తకాలలో, సినిమాలలో "హత్య కేసులు" ఎలా తీర్చబడుచున్నవో తెలుసుకొనుటకు ఇష్టపడతారు. "ఎవరు అది చేశారో" తెలుసుకొనుటకు లేక చివరిలో హంతకుడు దొరకుతాడో లేదో, అందులో ఉన్న అనిశ్చయత ఎప్పుడు తొలగుతుందో తెలుసుకొనుటకు ప్రయత్నించుటలో మానసిక ఆనందాన్ని పొందుతాము. ఉత్తర రాజ్యపు కథ రాజకీయ హత్యలతో నింపబడి ఉంది. యరొబాము మరణము నుండి జిమ్రీ మరణము వరకు ఇశ్రాయేలీయుల చరిత్రలో సుమారు ఇరవై సంవత్సరముల కాలము ప్రతిరాజు కనీసం ఒక హత్యలో హతుడో లేక హత్య చేసినవాడో అయి ఉన్నాడు. ముందుగానే తెలిసియుండుట వలన, కొద్ది పాటి అనిశ్చయత మాత్రం ఉంది. ఇంకా హత్యలతో చేరియున్న రాజులను గూర్చిన కథలు ఆసక్తికరంగా ఉన్నాయి మరియు బైబిలు విద్యార్థులకు ప్రయోజనకరం.

ఈ నలుగురు ఇశ్రాయేలు రాజుల కథలు 1 రాజులు 15:25–17:20 లో చెప్పబడ్డాయి[1] ప్రతి రాజు కుట్ర పూరితమైన కథలోనికి మనము చూద్దాము.

### నాదాబు, అపకీర్తి పరుడైన పాపి యొక్క కుమారుడు
### (1 రాజులు 15:25–27)

ఈ నలుగురు ఇశ్రాయేలు రాజులలో మొదటివాడు నాదాబు. గ్రంథం ఇతనిని గురించి మనకు చాలా తక్కువ చెబుతుంది. నాదాబు, యరొబాము కుమారుడని మనకు తెలుసు. అతడు ఇశ్రాయేలీయులపై రెండు సంవత్సరాలు పరిపాలించి, "యెహోవా దృష్టికి కీడు చేసి" తన తండ్రి నడచిన మార్గమందు నడిచాడు. తరువాత బయెషా "అతని మీద కుట్ర చేసి" అతనిని చంపెను. తరువాత బయెషా నాదాబును చంపుటతో ఆగలేదని మనము చదువుతాము. అతడింకా, "యరొబాము సంతతివారినందరిని హతము చేసెను" ఎవనినైనా యరొబామునకు సజీవునిగా ఉండనియ్యక అందరిని నశింపజేసెను. "తన సేవకుడైన షిలోనీయుడైన అహీయా ద్వారా యెహోవా సెలవిచ్చిన ప్రకారముగా ఇది జరిగెను" (1 రాజులు 15:29). గ్రంథకర్త ఇక్కడ అహీయా ద్వారా యరొబాముకు చేసిన ప్రవచనాన్ని 1 రాజులు 14:9, 10ని సూచిస్తున్నాడు:

> నీ కంటే ముందుగా ఉండిన వారందరి కంటెను అధికముగా కీడుచేసి యున్నావు; ... కాబట్టి యరొబాము సంతతి వారి మీదికి నేను కీడు రప్పించుచు, ఇశ్రాయేలు వారిలో అల్పులు గాని ఘనులు గాని లేకుండ మగవారినందరిని యరొబాము వంశము నుండి నిర్మూలము చేసి, పెంట అంతయు పోవునట్లుగా ఒకడు అవతలకు దానిని ఊడ్చివేసి నట్లు యరొబాము సంతతిలో శేషించినవారిని నేను ఊడ్చి వేయుదును.

దేవుడు యరొబాముతో ఇది ఎందుకు చెప్పాడు? నేను నీకు ఆజ్ఞాపించినదంతయు విని, నా మార్గముల ననుసరించి నడుచుచు, నా దృష్టికి అనుకూలమైన దానిని జరిగించినట్లయితే, దావీదు కుటుంబమును శాశ్వతముగా నేను స్థిరపరచినట్లు నిన్నును స్థిరపరచెదనని (1 రాజులు 11:38) దేవుడు అతనితో వాగ్దానం చేశాడు. అయినను, యరొబాము దేవుని మార్గములలో నడువక విగ్రహారాధన దోషాన్ని కలిగి ఉన్నాడు. అతని కుమారుడైన నాదాబు కూడ తన తండ్రి అభ్యసించినవాటిలో పని కలిగియుండుట ద్వారా పాపం చేసాడు. తన తండ్రి చేసిన అదే పాపములు నాదాబు చేశాడు కాబట్టి, అతడు నాశనం చేయబడ్డాడు (1 రాజులు 15:30).

యరొబాము సంతతి యొక్క నాశనము, దేవుడు తన ప్రజలతో చేసిన నిబంధన ననుసరించుటయై యున్నది. ఆ నిబంధనలో, ఎవరైతే నిబంధనను మీరి అన్యదేవతలను ఆరాధిస్తారో వారికి మరణ శిక్ష విధించాలని దేవుడు ఆజ్ఞాపించాడు (ద్వితీయోపదేశకాండము 17:2-6). యరొబాము సామ్రాజ్యమును నాశనం చేయుట ద్వారా, దేవుడు తన వాక్యమును నెరవేర్చి రాజుల అవిశ్వాసము యొక్క సందర్భములో ఏమి చేస్తానని బెదిరించాడో అది చేశాడు.

## బయెషా, బలత్కారుడైన రాజు
## (1 రాజులు 15:27-16:6)

నలుగురు రాజులలో రెండవవాడు బయెషా బైబిల్ చరిత్రకారుడు బయెషాను గురించి క్రింది విధంగా తెలియజేసాడు!

> బయెషా అతని (నాదాబు) మీద కుట్ర చేసెను. నాదాబును ఇశ్రాయేలు వారందరును ఫిలిష్తీయుల సంబంధమైన గిబ్బెతోనునకు ముట్టడి వేయుచుండగా గిబ్బెతోనులో బయెషా అతని చంపెను.
>
> బయెషా అతని చంపి అతనికి మారుగా రాజాయెను. తాను రాజు కాగానే ఇతడు యరొబాము సంతతి వారినందరిని హతము చేసెను ...
>
> ... వారి దినములన్నిటను ఆసాకును ఇశ్రాయేలు రాజైన బయెషాకును యుద్ధము జరుగుచుండెను.[2]
>
> ... బయెషా ... ఇరువది నాలుగు సంవత్సరములు ఏలెను. ఇతడు యెహోవా దృష్టికి కీడు చేసి యరొబాము దేనిచేత ఇశ్రాయేలువారు పాపము చేయుటకు కారకుడాయెనో దానంతటిని అనుసరించి ప్రవర్తించెను (1 రాజులు 15:27-34).

"యరొబాము పాపములను బట్టి" బయెషా నాదాబును చంపెను, కాని బయెషా అదే పాపముతో దోషి అయ్యాడు! బయెషా పాపమునకు ఫలితమేమిటి? హనని కుమారుడైన, ప్రవక్తయైన యహూ బయెషాకు ఈ సందేశం ఇచ్చాడు:

> "నేను నిన్ను మంటిలో నుండి తీసి హెచ్చింపజేసి ఇశ్రాయేలువారను నా జనులు మీద నిన్ను అధికారిగా చేసితిని అయినను యరొబాము ప్రవర్తించిన ప్రకారముగా నీవు ప్రవర్తించుచు, ఇశ్రాయేలువారగు నా జనులు పాపము చేయుటకు కారకుడవై, వారి పాపములు చేత నాకు కోపము పుట్టించియున్నావు. కాబట్టి బయెషా సంతతి వారిని అతని కుటుంబీకులను నేను సముల ధ్వంసము చేసి, నెబాతు కుమారుడైన యరొబాము సంతతివారికి నేను చేసినట్లు

నీ సంతతివారికిని చేయబోవుచున్నాను. పట్టణమందు చనిపోవు బయెషా సంబంధికులను ఆకాశ పక్షులు తీనును అనెను" (1 రాజులు 16:2-4).

అతని పాపము వలన, యరొబాము సంతతి నాశనము చేయబడినట్లే బయెషా సంతతి నాశనము చేయబడవలసి ఉంది.

చివరిగా, బయెషా మరణమును తెలియజేసిన తరువాత 1 రాజులు ఈ విధంగా చెబుతుంది,

... మరియు బయెషా యరొబాము సంతతి వలెనే యుండి తన కార్యములచేత యెహోవా దృష్టికి కీడు చేసి ఆయనకు కోపము పుట్టించిన దానినంతటిని బట్టియు, అతడు తన రాజును చంపుటను బట్టియు, అతనికిని అతని సంతతి వారికిని విరోధముగా యెహోవా వాక్కు హనానీ కుమారుడును ప్రవక్తయునగు యెహూకు ప్రత్యక్షమాయెను (16:7).

వారు చేసిన కీడును బట్టి మరియు యరొబాము మగ సంతానమంతటిని హతము చేయుటను బట్టి కూడ బయెషా అతని కుటుంబము వారు శిక్షింపబడ్డారు. యరొబాము పాపమును బట్టి, అతని సంతానమును నాశనము చేయుటకు బయెషా దేవుని దండము (కర) వలె ఉపయెగపడ్డాడు. అయినప్పటికి, బయెషా నాదాబుకు వ్యతిరేకముగా కుట్ర చేసి అతనిని చంపుట ద్వారా పాపము చేశాడు. కాబట్టి, అతను అతని కుటుంబము వారు ఆ పాపము చేశాడు. కాబట్టి, అతను అతని కుటుంబము వారు ఆ పాపము యొక్క ఫలితాన్ని పొందవలసి వచ్చినది.

## ఏలా, త్రాగుబోతైన రాజు
## (1 రాజులు 16:6-14)

మన ప్రస్తుత గ్రంథములో నాలుగు రాజులలో మూడవ వాడు బయెషా కుమారుడైన ఏలా. మన యిలా చదువుతాము.

బయెషా తన పితరులతో కూడ నిద్రించి తిర్సాలో సమాధిచేయబడెను, అతనికి మారుగా అతని కుమారుడైన ఏలా రాజాయెను ...

... రెండు సంవత్సరములు ఏలెను. తిర్సాలో తనకు గృహ నిర్వాహకుడగు ఆర్సా ఇంట అతడు త్రాగి మత్తుడై యుండగా, యుద్ధ రథములు అర్ధభాగము మీద అధికారియైన జిమ్రీ అతని మీద కుట్ర చేసి లోపలికి చొచ్చి అతనిని కొట్టి చంపి అతనికి మారుగా రాజాయెను (1 రాజులు 16:6-10).

బయెషా కుమారుడైన ఏలా, బయెషా తన ముందున్న రాజును ఎలా చంపాడో, అలాగే తన అధిపతులలో ఒకని చేత చంపబడ్డాడు. ఎందుకు? ఆ ప్రశ్నకు బైబిలు జవాబు చెబుతుంది:

... అతడు (జిమ్రీ) సింహాసనాసీనుడై ఏలనారంభించిన తోడనే బయెషా సంతతి వారందరిలో ఏ పురుషునేగాని అతని బంధువులలోను మిత్రులలోను ఎవరినేగాని మిగుల నియ్యక అందరిని హతము చెసెను.

బయెషాయును అతని కుమారుడగు ఏలాయును తామే పాపము చేసి, ఇశ్రాయేలువారు పాపము చేయుటకు కారుకులై, తాము పెట్టుకొనిన దేవతల చేత ఇశ్రాయేలీయుల దేవుడైన

> యెహోవాకు కోపము పుట్టించిరి గనుక వారు చేసిన పాపములను బట్టి ప్రవక్తయైన యెహూ ద్వారా బయెషాను గూర్చి యెహోవా సెలవిచ్చిన మాట నెరవేరుటకై జిమ్రీ బయెషా సంతతివారి నందరిని నాశనము చేసెను (1 రాజులు 16:11–13).

యరొబాము పాపమును బట్టి అతని కుటుంబమును నాశనము చేయుటకు దేవుడు బయెషాను ఉపయోగించుకొన్నట్లే, బయెషా పాపమును బట్టి అతని కుటుంబమును నాశనము చేయుటకు దేవుడు జిమ్రీని ఉపయోగించుకొనెను.

ఏలా తన నాశనమునకు తానే సహకరించుకొన్నట్లు మనమర్థం చేసుకోవచ్చును, విగ్రహారాధన ద్వారా పాపము చేయుట మాత్రమే కాక అతడు "త్రాగి మత్తుడై" యుండుట ద్వారా కూడ సహకరించుకొన్నాడు. మద్యపానం ద్వారా ఎప్పుడూ ఏ మంచి రాదు! ఏలా త్రాగకుండినట్లయితే, రాజకీయ హత్యను తప్పించుకొనేవాడే.

## జిమ్రీ, ఒక వారపు రాజు
## (1 రాజులు 16:15–20)

నలుగురు రాజులలో చివరి రాజును గూర్చిన కథ త్వరగా ముగింపబడినది. 1 రాజులు 16:15–19లో యిలా చదువుతాము:

> యూదా రాజైన ఆసా ఏలుబడిలో ఇరువది యేడవ సంవత్సరమున జిమ్రీ తిర్సాలో ఏడు దినములు ఏలెను. జనులు ఫిలిష్తీయుల సంబంధమైన గిబ్బెతోను మీదికి వచ్చి అక్కడ దిగి యుండగా జిమ్రీ కుట్ర చేసి రాజును చంపించెనను వార్త అక్కడ దిగియున్న జనులకు వినబడెను. గనుక ఇశ్రాయేలు వారి మీద రాజుగా పట్టాభిషేకము చేసిరి. వెంటనే ఒమ్రీ గిబ్బెతోనును విడిచి అతడును ఇశ్రాయేలు వారందరును తిర్సాకు వచ్చి దానిని ముట్టడి వేసిరి. పట్టణము పట్టబడెనని జిమ్రీ తెలుసుకొని, తాను రాజనగరునందు జొచ్చి తనతో కూడ రాజనగరును తగులబెట్టుకొని చనిపోయెను. యరొబాము చేసినట్లు ఇతడును యెహోవా దృష్టికి చెడుతనము చేయువాడై యుండి తానే పాపము చేయుచు,[3] ఇశ్రాయేలువారు పాపము చేయుటకు కారకుడైనందున ఈలాగు జరిగెను.

1 రాజులు రచయిత అంతర్యుద్ధమును వివరిస్తూవెళ్లాడు. జిమ్రీ మరణము తరువాత కొందరు ఇశ్రాయేలీయులు ఒమ్రీని అనుసరించారు, ఇంకా కొందరు తిబ్నీని అనుసరించారు. "ఒమ్రీ పక్షపువారు ... తిబ్నీ పక్షపు వారిని జయింపగా తిబ్నీ చంపబడెను ఒమ్రీ రాజాయెను" (16:22).

జిమ్రీని గురించి ఏమి చెప్పబడినది? అతని గురించి మంచిగా తెలుపబడిన ఒక విషయం ఏమిటంటే, దేవుని ముందు జాగ్రత్తను బట్టి అతడు బయెషా మరియు ఏలా కుటుంబముపై తీర్పును జరిగించాడనునది. తెలుపబడిన అతని చర్యలన్నీ దుర్మార్గమైనవి: అతడు కుట్ర చేసి రాజును చంపాడు,[4] అతడు రాజ కుటుంబీకులందరిని హతము చేశాడు, అతడు "యెహోవా దృష్టికి కీడు చేసి యరొబాము మార్గములన్నిటిలో నడిచాడు," ఆ తరువాత అత్మహత్య చేసుకొని అతడు చనిపొయాడు![5] అతడు ఏలాను అతని సంతానాన్ని చంపుటయే కాక, తన్నుతాను చంపుకొన్నాడు! జిమ్రీ మరణంతో, హత్యద్వారా చెడిపోయిన నలుగురు రాజుల భయంకర పాలన ముగింపుకు వచ్చినది.

## మన కొరకు పాఠాలు

ఈ నలుగురు రాజుల ద్రోహపూరిత జీవితాలను గూర్చి మనం చదువుచుండగా, ఎలాంటి క్రైస్తవ సత్యాలను గమనిస్తాము?

*"పాపం వలన వచ్చు జీతము వాస్తవము."* పాతనిబంధనలోని రాజులను గూర్చిన అధికశాతం కథలలో ఈ నలుగురు రాజుల వివరాలు "పాపము వలన వచ్చు జీతము మరణము" (రోమీయులకు 6:23) అను విషయాన్ని మనకు గుర్తు చేస్తున్నాయి. వారి పాపమునకు శిక్షగా, యరొబాము మరియు బయెషా ఇద్దరి కుటుంబముల వారినందరిని చంపమని దేవుడు ఆజ్ఞాపించాడు. కాని మనం పాపం చేసినప్పుడు ఆత్మీయంగా చనిపోతున్నాము. ఈ రోజు మనం మన పాపములను బట్టి మన భౌతిక జీవితాలను కోల్పోము (కొన్ని పాపాలు భౌతిక దేహమరణానికి కారణం కావచ్చు), మనం మారుమనస్సు పొందకపోతే, పాపం మనలను నిత్యమరణానికి నడిపిస్తుంది.

దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చుటకు సహకరించిన పాపమైనప్పటికి దాని ఫలితం శిక్షే (1 రాజులు 16:7). ప్రజలు తరచుగా అడిగేకొన్ని ప్రశ్నలకు ఈ వాస్తవం సహాయపడుతుంది. ఉదాహరణకు, సిలువపై క్రీస్తు మరణము ముందుగా నిర్ణయింపబడి యూదా క్రీస్తును అప్పగించుటకు నడిపింపబడినది, ఆ మరణం మానవాళికి రక్షణను అనుగ్రహించినది, అప్పుడు యూదా క్రీస్తును అప్పగించినందుకు దేవుడతనిని ఎందుకు నిందించాడు? జవాబు స్పష్టము: బయెషాలాగా, దేవుని ప్రణాళిక నెరవేర్పులో యూదా తన పాత్రను పోషించాడు అయితే పాపం ఏమైనప్పటికి పాపమే, అది వారి ప్రయత్నం ద్వారా చేయబడినది. బయెషా తన పాపమును బట్టి శిక్షింపబడినట్లు, యూదా తను చేసిన దానిని బట్టి శిక్షింపబడ్డాడని మనం కచ్చితంగా నమ్మవచ్చును.

*"హింస హింసను పుట్టిస్తుంది."* ఈ రాజులు పరిపాలన హింస ఇంకా అధిక హింసకు నడిపిస్తుందని మనకు గుర్తుచేస్తుంది! హంతకులు దాదాపు తమను తాము హత్య చేసుకొన్నట్లే అవుతుంది. "కత్తి పట్టుకొను వారందరు కత్తి చేతనే నశింతురు" (మత్తయి 26:52బి) అని యేసు చెప్పాడు. కాబట్టి మనము, "కత్తి పట్టుకొనకూడదు" యేసు తన శిష్యులందరూ సమాధాన కర్తలుగా ఉండాలని కోరుకొన్నాడు. వివాధాలలో మనమెప్పుడు సమాధాన తీర్పుల కొరకు చూడాలి. ఒకవేళ, హింస చేయాలన్న శోధన మనకొచ్చినప్పుడు, ఉదాహరణకు, మనపట్ల తప్పుచేసిన వ్యక్తిని కొట్టాలనుకొన్నప్పుడు ఫలితం మనమే తిరిగి హింసను పొందుతామని మనం కచ్చితంగా గుర్తెరగాలి.

*"వాస్తవంగా లేక హృదయములో హత్యకు నడిపించు చర్యలు మరియు గుణలక్షణాలను తప్పించుకోవాలి."* ఈ మరణాల వివరాలు, కూడ పాప యుక్తమైన మరణం ఎలా ఉంటుందో గుర్తు చేస్తున్నాయి. ఈ హంతకులైన రాజులు వారి నేరాలను బట్టి ఘోరమైన అపకీర్తిలో జీవించారు. బయెషా, జిమ్రీ ఇద్దరూ వారు చేసిన హత్యలకు తిరస్కరింపబడ్డారని మనం గుర్తుంచుకోవాలి. ద్రోహము చేసినందుకు "జిమ్రీ" సామెతగా మిగిలాడు!

హత్య అనేది, దేశం దృష్టిలో నేరం మరియు దైవం దృష్టిలో పాపము అవుతుంది.[6] హత్య రెండింటిలో పాతనిబంధనలో (నిర్గమకాండము 20:13), మరియు క్రొత్త నిబంధనలో

(మత్తయి 19:18; ప్రకటన 21:8) అనుమతింపబడలేదు.

"నేను క్రీస్తు శిష్యుడును, నేనెప్పుడూ ఎవరినీ హత్య చేయును," అని చెప్పుకొనుటకు మనం ఇష్టపడవచ్చును! కచ్చితంగా, మనం ఉద్దేశపూర్వకంగా ఎవరి ప్రాణము తీయుము, అయితే, మనం దానికి సమానమైన పాపము చేయుటకు కారణమగు చర్యలు, గుణలక్షణాలను తప్పించుకోవాలి.

> నరహత్య చెయవద్దు, నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని పూర్వికులతో చెప్పబడిన మాట మీరు విన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును, తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహా సభకు లోనగును, ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును (మత్తయి 5:21, 22).

మరోవిధంగా, ఒకరిని అసహ్యించుకొనుట, కోపపడుట, ఒకనితో తిరస్కారముగా మాట్లాడటం ఆ వ్యక్తిని హత్య చేయుటతో సమానం.[7]

"మీరాశించుచున్నారు గాని మీకు దొరకుట లేదు. నరహత్య చేయుదురు మత్సరపడుచున్నారు గాని సంపాదించుకొనలేరు, పోట్లాడుదురు యుద్ధము చేయుదురు గాని" (యాకోబు 4:2ఎ) అని యాకోబు వ్రాశాడు. యాకోబు వాక్యానికి సంబంధించి, డేవిడ్ రోపర్ ఇలా వ్రాశాడు, "2 వచనం, మీరు నరహత్య చేయుదురు. పోట్లాడుదురు, యుద్ధము చేయుదురు. ఈ మాటలు, ఎవరైనా ఒకడు తన సొంత పద్ధతిలో ఏదైనా కోరుకొంటే, తన మార్గములో అడ్డున్న వారిని తప్పిస్తారనే ఉద్దేశముతో ఉపమాన రీతిగా వాడబడ్డాయి."[8] కాబట్టి, మన సొంత మార్గములో పోయే అవకాశం మనం తీసుకొన్నప్పుడు, మనం కోరుకొన్న దానిని పొందుటకు ఇతరులకు హాని చేస్తే, మనం హత్య చేసిన దోష ఫలితాన్ని అనుభవిస్తాము!

హెచ్చరికను లక్ష్యము చేద్దాము: హత్య అనేది భయంకరమైన పాపము! "హత్య" యొక్క పాపము ప్రతిసారి ఎవరో ఒకరిని అక్షరార్థంగా హత్య చేస్తేనే రాదు. నీ హృదయములో మాత్రమే హత్య సంబంధమైన ఆలోచనలు క్రియలు పుడతాయి, కోపంలో లేక చెడ్డ మాట లలో లేక స్వార్థప్రయోజనం సాధించుటకు ఇతరులను నాశనం చేయుటలో అవి బయట పడతాయి. ఆలాంటి హత్యలు, పాఠంలో మనము చదివినట్లుగా ఆ రాజుల చేత చేయబడిన క్రియలులాంటివై కీడును కలిగిస్తాయి.

"యెహోవా దృష్టికి కీడు చేసిన" రాజులు వారి పాపములను బట్టి నాశనం చేయబడి ఉంటారని మనం కచ్చితంగా అంగీకరించవచ్చును వారు ఇతరులను హత్య చేసినప్పుడు వారి చర్యలు ఎంత తుచ్ఛమైనవిగా ఉంటాయో మనం గమనించవచ్చును. అదే సమయములో, మనం నిందితులవైపు మన వ్రేళ్ళను చూపించుచుండగా, మనమూ అలాంటి పాప దోషంలో పడవచ్చని గుర్తించాలి. మనము మార్పు చెందక పోయినట్లయితే అసహ్యం, అసూయ, అధికార దాహం, మరియు భౌతిక వస్తువలు మనలను దోషిగా చేస్తాయి.

---

సూచనలు

[1]యరొబామును అనుసరించిన నలుగురు రాజుల కాలాలు సుమారుగా: ఇశ్రాయేలీయుల రెండవ రాజైన నాదాబు – క్రీ.పూ. 909–908; మూడవ రాజైన బయెషా – క్రీ.పూ. 908–886; నాలుగవ రాజైన ఏలా – క్రీ.పూ. 886–885; ఐదవ రాజైన జిమ్రీ – క్రీ.పూ. 885. [2]బయెషా, ఆసా ఒకరినొకరు ఎదుర్కొను ఒక సంఘటన 2 దినవృత్తాంతములు 16:1–6లో

వివరించబడినది. [3]"అతడు చేసిన పాపములలాంటి పాపములు" అను వాక్యము, కేవలం అతని ఏడు రోజుల పాలనను గాక, జిమ్రీ జీవితాన్ని మొత్తాన్ని కప్పుతుంది (Herbert Lockyer, *All the Kings and Queens of the Bible* [Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1961], 154). [4]తన రాజుకు విరోధంగా కుట్ర చేసిన ఒక ఆర్మీ కమాండరుగా జిమ్రీ చరిత్రలో ఒక ఉదాహరణగా ఉన్నాడు, 2 రాజులు 9:31 చూడుము. "జిమ్రీ పేరు, సమస్తమైన ద్రోహమునకు సామెతగా మారింది" అని Lockyer వ్రాశాడు. (Ibid.) [5]పాతనిబంధనలో తెలియజేయబడిన కొద్దిపాటి ఆత్మ హత్యలలో ఇది ఒక్కటి. మూడు ఆత్మహత్యలు, సౌలు, అతని ఆయుధములు మోయువానిని (1 సమూయేలు 31:4, 5) మరియు అహీతోపెలు (2 సమూయేలు 17:23). [6]"హత్య" "ఉద్దేశపూర్వకంగా, అసూయతో మానవ జీవితమును తీసుకొనుట" అని నిర్వసించవచ్చును. అనుకోకుండానో లేక ఆత్మ రక్షణ కొరకో ఒక వ్యక్తిని చంపినప్పుడు, దేశము నేరస్తుని శిక్షించినప్పుడు లేక దేవుడు ఆ వ్యక్తిని చంపినప్పుడు, దేశము నేరస్తుని శిక్షించినప్పుడు, ఆ మాటలు అతనికి ఆపాదించబడవు. [7]"ఆజ్ఞాతిక్రమమునకు మూలమైన హృదయ దుష్ట స్వభావమును ఆయన తిరస్కరించాడు. బహు చర్యయైన హత్యకు ప్రారంభము, పాప స్వభావమైన కోపము లేక అసహ్యము, ఆ వైఖరి ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకమైన పాపము" అని ఒక రచయిత చెప్పాడు. (Mark W. Chavalas, "Murder," *Baker Theological Dictionary of the Bible*, ed. Walter A. Elwell [Grand Rapids, Mich.: Baker Books, 1996], 546.) [8]David Roper, *Practical Christianity: Studies in the Book of James* (Nashville: Gospel Advocate Co., 1987), 82.